క్లుప్తంగా

పాలిటెక్నిక్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

- హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు



సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి పాలిసెట్-2023లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ప్రారంభించారు. తొలి రోజు 85మంది విద్యార్థులు హాజరయ్యారు. 293 ర్యాంక్ సాధించిన కె.సాయిసాత్విక్, 862 ర్యాంక్ సాధించిన ఎస్ నిహారిక సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కి వచ్చారు. 5వతేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు.

వీవోఏల ఆందోళన



డ్వాక్రా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీవోఏలు

పరవాడ: వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఉమా, పి.రమా డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం డ్వాక్రా కార్యాలయం ఎదుట సోమవారం వీవోఏలు ఆందోళన చేపట్టారు. కాల పరిమిత సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయడంతో పాటు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 15 సంఘాల లోపు ఉన్న వీవోఏలకు వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వరలక్ష్మి, వెంకటలక్ష్మి, నీలిమ, నాగమణి, పైడిలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



పాట పాడుతున్న విద్యార్థి

సింహాచలం: అడవివరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగ విజ్ఞాన సమితి వ్యవస్థాపకుడు బి.బి.రాజేంద్రప్రసాద్, న్యాయవాది రామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఉపాధ్యాయురాలు భవానీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. బాల్యదశలోనే అన్ని విషయాలను గ్రహించి భవిష్యత్ తరాలవారికి మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టోరీ రైటింగ్ పోటీలు



స్టోరీ రైటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. గ్రంథాలయ అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు స్టోరీ రైటింగ్, ఆటల పోటీలు నిర్వహించారు. శిబిరాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.50 కోట్లతో పరిశోధన కేంద్రాలు

కొమ్మాది: శాస్త్ర పరిశోధనలు బలోపేతం చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ.50 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తుందని వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలిపారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యంలో నూతన అధ్యాపకులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశోధనల్లో అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి కృషి చేస్తున్నామన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
7997958341, 9912440606

రాజీ ప్రయత్నాలు ఫలించలేదు

- కొలిక్కిరాని డ్రైనేజీ వివాదం
- గ్రామ సభలో నిర్ణయం తీసుకోవాలని అధికారుల సూచన



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పి.బోనంగి- వీఎల్ఎన్ పురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేస్తూ తవ్విన కాలువ

పరవాడ: మండలంలోని పి.బోనంగి గ్రామంలో వివాదాస్పదంగా మారిన డ్రైనేజీ సమస్యను పరిష్కరించే దిశగా ఇరువర్గాల మధ్య అధికారులు చేసిన రాజీ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో సమస్యను గ్రామ సభలో పెట్టి పరిష్కరించుకోవాలని సూచించి అధికారులు వెనుదిరిగారు. డ్రైనేజీ నిర్మాణానికి ఓ వర్గం ఎంతకీ అంగీకరించక పోవడంతో ఆగ్రహించిన రెండో వర్గం వారు వి.ఎల్.ఎన్.పురం- పి.బోనంగి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారిని సోమవారం రాత్రి పొక్లెయిన్‌తో తవ్వి రాకపోకలకు అడ్డంకులు సృష్టించారు. ఫలితంగా గ్రామం మీదుగా ప్రయాణించే పరిసర గ్రామాల ప్రయాణికులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు.

వివరాల్లోకి వెళితే...

గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా గ్రామ పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో డ్రైనేజీలు నిర్మించాలని పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. నాలుగు నెలల కిందట నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. అయితే తనకు చెందిన జిరాయితీ స్థలంలో కాలువల నిర్మాణం తగదని మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు అడ్డు తగిలారు. దీంతో కాలువ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గ్రామ సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ కల్పించుకొని సమస్యను స్పందన, రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, ఎంపీడీవో, పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను ప్రస్తావించడంతో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కల్పించుకొని డ్రైనేజీ సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తహసీల్దారు వి.ప్రకాశరావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఆర్ అండ్ బీ ఏఈ లలిత, ఈవోఆర్డీ పద్మజ, పోలీసు సహకారంతో గ్రామంలో ఇరువర్గాల వారితో సమావేశం నిర్వహించారు. తన సొంత స్థలంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టడడం కుదరదని మాజీ సర్పంచ్ దేముడు తెగేసి చెప్పడంతో అధికారులు చేసేది లేక సమావేశం నుంచి వెనుదిరిగారు. ఆగ్రహించిన మరో వర్గం వారు రహదారిలో అడ్డంగా కాలువ తవ్వి రాకపోకలకు అడ్డంకులు సృష్టించారు. దీంతో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. సమాచారం అందుకున్న సీఐ పి.ఈశ్వరరావు రంగ ప్రవేశం చేసి వాగ్వాదం తారా స్థాయికి చేరకుండా చర్యలు తీసుకున్నారు. వివాదానికి కారణమైన ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిసింది.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రా లు అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరమశివా.. పాహిమాం



సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. హరనామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

రోడ్డు ఇలా.. రాకపోకలెలా?



ఊటగెడ్డ వంతెన వద్ద రహదారిలో ఏర్పడిన భారీ గుంత



బ్రిక్స్ ఫ్యాక్టరీ వద్ద శిథిలమైన రహదారి

- ఊటగెడ్డ వద్ద శిథిలమైన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పరవాడ: అధికారుల పర్యవేక్షణ లోపమో..!.. పనుల్లో నాణ్యత లోపమో తెలియదుకాని ఆ రోడ్డు వేసి ఏడాది గడవక ముందే పలు చోట్ల శిథిలమైంది. దీంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఊటగెడ్డ కూడలి-ఎన్టీపీసీ రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.60 లక్షలు మేర ఖర్చు చేసింది.నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడం వల్లే ఏడాది తిరక్కముందే రోడ్డు మరమ్మతులకు నోచుకుంటుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన ఊటగెడ్డ-ఎన్టీపీసీ రహదారిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టరు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా రోడ్డు రెండు మూడు నెలలకే రిపేర్లకు నోచుకోవడం మొదలైంది. ఆ తర్వాత అధికారులు స్పందించి రిపేర్లు చేయించడం పరిపాటిగా మారింది. మళ్లీ రోడ్డు అధ్వానంగా మారింది. ఊటగెడ్డ నుంచి ఎన్టీపీసీ మధ్యలో రహదారి పెచ్చులుగా ఊడిపోయింది. ఊటగెడ్డ వంతెన వద్ద ఏర్పడిన భారీ గుంత ప్రయాణికులను ప్రమాదాలకు గురిచేస్తుంది. ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, గ్రామీణ ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండడం వల్ల రాత్రి వేళ గుంతలు గుర్తించలేక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి మరమ్మతులతో మూలుగుతున్న రహదారిని అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అత్తింటి ఎదుట కోడలు నిరసన

కూర్మన్నపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వివాదానికి దారితీశాయి. ఏడాది కిందట ప్రసవానికి పుట్టింటి నుంచి వెళ్లిన భార్యను తిరిగి రానివ్వకపోవడంతో భర్త ఇంటి ముందే నిరసనకు దిగింది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిసిన వివరాల ప్రకారం వుడా ఫేస్-7కు చెందిన పూడి వరకుమార్, మల్కాపురం ప్రాంతానికి చెందిన ఆడారి శ్రీపల్లవి ఇద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తుండగా ప్రేమించుకున్నారు. క్రిస్టియన్ సంప్రదాయబద్ధంగా 2018లో వివాహం చేసుకున్నారు. ఇరువురి మతాలు వేరు కావడంతో వివాహం తర్వాత వివాదాలు పెరిగాయి. ఫోన్‌లో ఇతరులతో పాటు తల్లిదండ్రులతో కూడా మాట్లాడవద్దని, ఉద్యోగం మానేయాలని, దుస్తులపై కూడా భర్త ఆంక్షలు పెట్టడంతో వివాదం మరింత ముదిరింది. ఈ క్రమంలో పుట్టింటికి ప్రసవానికి వెళ్లిన శ్రీపల్లవి 2022లో బాబుకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి కన్నవారి ఇంటిలోనే ఉంటోంది. బాబు పుట్టిన మూడు నెలలకు భర్త రమ్మంటే ఐదో నెలలో వస్తానని చెప్పుకొచ్చారు. పుట్టిన బాబుకు హిందూ సంప్రదాయం ప్రకారం అన్నప్రాసన, ఉయ్యాలలో వేయడం వంటి శుభకార్యాలు చేసినా భర్త వరప్రసాద్‌కు సమాచారం ఇవ్వలేదు. దీంతో ఇరు కుటుంబాల మధ్య వివాదాలు మరింత పెరిగాయి. ఎట్టకేలకు సోమవారం బాబును తీసుకుని శ్రీపల్లవి అత్తవారింటికి వచ్చింది. దీంతో వరకుమార్ భార్య శ్రీపల్లవిని ఇంట్లోకి రావద్దని అడ్డుకున్నాడు. కుమారుని శుభకార్యాలకు తనకు సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శ్రీపల్లవి మహిళా సంఘాలను ఆశ్రయించింది. మహిళా సంఘాలు వరకుమార్ ఇంటికి చేరుకోవడంతో తన పరువు తీస్తావా అంటూ భార్య శ్రీపల్లవిపై మండిపడ్డాడు. దీంతో మహిళా సంఘాల పోలీసులకు సమాచారాన్ని చేరవేయడంతో సీఐ శ్రీనివాసరావు ఇరువర్గాలను పిలిపించి నచ్చచెప్పారు. పెద్దల సమక్షంలో చర్చించుకుంటామని వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే స్కూల్‌ను తొలగించొద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పూర్వ విద్యార్థులు, విద్యా కమిటీ సభ్యులు

మహారాణిపేట: రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల(రైల్వే స్కూల్) తొలగింపు నిర్ణయానికి వ్యతిరేకంగా స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. 430 మంది విద్యార్థులతో ఈ పాఠశాల అభివృద్ధి పథంలో నడుస్తోందని, నాడు-నేడు కింద ప్రభుత్వం అనేక ఆధునికీకరణ పనులు చేపట్టిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకుంటున్న రైల్వే పాఠశాలను మూసి వేస్తామని రైల్వే అధికారులు చెప్పడం బాధాకరమని పూర్వ విద్యార్థి కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. ఈ నెల 3న ఇచ్చిన నోటీసులో వారం రోజుల్లో ఖాళీ చేయాలని ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాన్ని పునః పరిశీలన చేయాలని ఆయన కోరారు.

పరవాడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

పలు రికార్డుల పరిశీలన



మహిళా పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

పరవాడ: అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వెంకటమురళీకృష్ణ సోమవారం పరవాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. నేరాల సంఖ్య, పెండింగ్ కేసులు, శాంతి భద్రతల పరిరక్షణపై ఆరా తీశారు. స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. రహదారి భద్రత , ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫార్మా పరిశ్రమలకు రాకపోకలు సాగిస్తున్న వాహనాల ట్రాఫిక్‌ను ఏ విధంగా నియంత్రించాలో సిబ్బందికి అవగాహన కల్పించారు. సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మహిళా పోలీసుల సేవలను పోలీస్ స్టేషన్ అధికారులు సద్వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ క్రైం, దిశ యాప్‌లపై మహిళా పోలీసు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ వెంకటమురళీకృష్ణ సూచించారు. కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐలు సురేష్, మల్లేశ్వరరావు, తేజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు సబ్బవరం కేజీబీవీ ఎస్‌వో మృదుల తెలిపారు. ఏడాది కాలపరిమితితో భర్తీ చేయనున్నట్టు పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి వారు ఏపీ కేజీబీవీ వెబ్ సైట్‌లో వచ్చే నెల 4వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్లు, ఎస్సీ,ఎస్టీ,బీసీలకు 5 సంవత్సరాలు,మాజీ సైనిక ఉద్యోగులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయోపరిమితి సడలింపు ఉంటుంది. జిల్లాల వారీగా సబ్జెక్టు వారీగా, రోస్టర్ వారీగా పోస్టుల తెలుసుకోవాలని పేర్కొన్నారు.

కరాటే విజేతలకు అభినందన



కరాటేలో ప్రతిభ కనబర్చిన డ్రాగన్‌లైన్స్ విద్యార్థులు

పరవాడ: విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ ఇండో నేపాల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో డ్రాగన్‌లైన్స్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాల పంట పండించారు. ఈ కరాటే పోటీల్లో తిక్కవానిపాలెం, సమ్మెంగపాలెం, గంగునాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు బి.హారిక, ఎస్.అను, కె.రాఘవేంద్రస్వామి, కణితి రాధాకృష్ణలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బంగారు, వెండి, రజిత పతకాలను సొంతం చేసుకున్నారని గ్రాండ్ మాస్టర్ ఎస్.నూకరాజు చెప్పారు. పతకాల పంట పండించిన విద్యార్థులను సోమవారం నూకరాజు, కోచ్‌లు ఓలిశెట్టి ప్రసాద్, ఎం.తులసీరావు అభినందించారు.

సీఎంఏ కోర్సుతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ కృష్ణమాచారి

సీతంపేట: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం చాప్టర్‌కు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. 2023 నుంచి 27 వరకు తొమ్మిది మందితో ఎగ్జిక్యూటివ్ బాడీ ఏర్పాటైంది. పి.బి.కృష్ణమాచారి చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా యు.లక్ష్మణరావు, కార్యదర్శిగా జి.రామచంద్రారెడ్డి, హిమబిందు కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అక్కయ్యపాలెంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చైర్మన్ కృష్ణమాచారి మాట్లాడుతూ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్(సీఎంఏ) కోర్సుతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రస్తుతం సంస్థలో 800 మంది సీఎంఏ విద్యార్థులు ఉన్నారని, ప్రతి ఏటా 300 నుంచి 600 మంది ఈ కోర్సులో చేరుతున్నారని చెప్పారు. వారికి అవసరమైన అన్ని సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో తరగతులు, ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎంఏ కోర్సు పూర్తి చేసిన వారికి పబ్లిక్ సెక్టార్‌లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మణరావు, కార్యదర్శి జి.రామలింగారెడ్డి, కోశాధికారి హిమబిందు, సభ్యులు శిరీష, నరేంద్ర, వెంకటేష్, సంపత్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో వెంకటరావు

సింహాచలం: పెందుర్తి తహసీల్దార్‌గా శ్యామ్‌ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కె. వెంకటరావు తదితరులు శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

గాజువాకలో పాఠశాలల విలీనానికి వినతి



ఇన్‌చార్జి డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: అగనంపూడి రెవెన్యూ పరిధి, పరవాడ మండల విద్యాశాఖ పరిధిలోని పినమడక, లేమర్తి జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు మరో 6 ఎంపీపీ పాఠశాలలను గాజువాక మండలంలో విలీనం చేయాలని అగనంపూడి అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు విశాఖ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విన్నవించడంతో ఆయన పాఠశాలల విలీనంపై ఇన్‌చార్జి డీఈవోకు లేఖను రాశారు. ఈ లేఖను అగనంపూడి అఖిలపక్ష కమిటీ డీఈవోకు అందజేశారు. దీంతో పాటు అగనంపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్‌సీసీని కొనసాగించేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నగర ఉపాధ్యక్షుడు సాలాపు అచ్చిబాబు, జిల్లా లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ కడిమి హనుమంతరావు, జిల్లా ఓబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోమాడ రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు

మహారాణిపేట : ఆర్టీసీలో పనిచేసి రిటైర్ అయిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ రీజియన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.భానుబాబు డిమాండ్ చేశారు. డిపోల్లో డ్రైవర్, కండక్టర్, మెకానిక్, హెల్పర్‌గా పనిచేసి రిటైర్ అయ్యామని, తాము వివిధ సమస్యలతో సతమతమౌతున్నామని, వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ సెటిల్‌మెంట్ చేయాలని, ఈపీఎఫ్ పెన్షన్ చాలా మందికి రావడం లేదని, రిటైర్ అయిన వారందరికీ పింఛను ఇవ్వాలని కోరారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట అర్చకులు పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని ఆలయ అధికారులు కోరారు.

'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్'పై పోటీలు



డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ సంస్థలు సంయుక్తంగా సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీలు నిర్వహించాయి. 'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై జరిగిన డ్రాయింగ్, ఎలక్యూషన్, క్విజ్ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఏయూ పర్యావరణ విభా గం ఆచార్యుడు ఇ.యు.బి.రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచానికి ఎంతో చేటుగా మారిందని వివరించారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ బాబూరావు, సెయింట్ జోసెఫ్ కళాశాల లెక్చరర్ మేరీ అనుపమ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ శ్రీలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం, గ్రీన్ వలంటీర్లు వి.కిరణ్మయి, ఎంజలీన్ భాస్కర్, జీవీఎంసీ ప్రతినిధి మంగరాజు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com